క్లుప్తంగా

ఫుట్‌బాల్‌లో మెరిసిన సంక్షేమ విద్యార్థినులు


ట్రోఫీతో హాస్టల్ క్రీడాకారిణులు

కర్నూలు(అర్బన్): తెలంగాణ రాష్ట్రం గద్వాల సోమనాద్రి ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన ఫుట్ బాల్ పోటీల్లో నగరంలోని నంబర్–1 సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం విద్యార్థినులు సత్తా చాటారని వసతి గృహ సంక్షేమాధికారిణి బీ.బెన్నమ్మ తెలిపారు. తమ హాస్టల్‌లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రజిత, అనిత అత్యంత ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయిలో జట్టు మొదటి స్థానంలో నిలిచేందుకు కృషి చేశారని ఆమె బుధవారం తెలిపారు. ఈ నేపథ్యంలో ఫర్ మెన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరెడ్డి క్రీడాకారిణులను అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు రగ్బీ జట్టు ఎంపిక


జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కర్నూలు (టౌన్): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్ పట్టణంలో ఈనెల 15న నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలుర అండర్–15 రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చాటాలని రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు సూచించారు. బుధవారం బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ఆయన ప్రకటించారు. వారికి క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఎంపికైన రాష్ట్ర బాలుర జట్టులో భరత్, సిమోన్, సూరి, రామ్‌చరణ్, మధు, నాగసుజిత్, వరుణ్, ఫిరోజ్, సుబ్రమణ్యం, సత్యదేవ్, మనోహ, ఓబులేసు ఉన్నారు.

యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న యువకులను అభినందిస్తున్న నిర్వాహకులు

కర్నూలు (హాస్పిటల్): టాటాలైఫ్ 24వ వార్షికోత్సవం సందర్భంగా డేనియల్ శేఖర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కర్నూలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో టాటా లైఫ్ బ్రాంచ్ మేనేజర్ నవీన్ గుప్తా మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డేనియల్ రాజు ఫౌండేషన్ అధ్యక్షుడు సుమన్, టాటా లైఫ్ మేనేజర్ నవీన్ గుప్త, బిజినెస్ మేనేజర్ చిన్నస్వామి, బజాజ్ ఇన్సురెన్స్ మేనేజర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు అనుమతించాలి

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను హాజరుతో సంబంధం లేకుండా సెమిస్టర్ పరీక్షలకు అనుమతించాలని కోరుతూ బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ బాబు ఆ వర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆయన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో వీసీని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. జిల్లాలో అత్యధిక శాతం వెనకబడిన సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని, వ్యవసాయ ఆధారిత కుటుంబాలు ఉన్న ప్రాంతం కావడంతో విద్యార్థులు పలు కారణాల వల్ల కాలేజీకి పూర్తిస్థాయిలో హాజరు కాలేకపోయి ఉంటారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పరీక్షలకు అనుమతించాలని కోరారు. వీసీని కలిసిన వారిలో జయకృష్ణ, ఆనంద్, చందు, జతిన్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించండి


రీసర్వే ను పరిశీలిస్తున్న జేసీ నవ్య

కర్నూలు(రూరల్): భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ నవ్య ఆదేశించారు. మండల పరిధిలో ఈ.తాండ్రపాడు గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేను బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతుల సహకారంతో ఎలాంటి తప్పులు లేకుండా రీసర్వేను పూర్తిచేయాలన్నారు. రైతుల నుంచి తిరిగి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జాయింట్ ఎల్.పి. నంబర్లు నమోదు కాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్, తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, మండల సర్వేయర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● లలితా దేవీ నమోస్తుతే..


ప్రత్యేక అలంకరణలో లలితా దేవి

సూర్యనారాయణ స్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న భక్తులు




సాయిూశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

కర్నూలు కల్చరల్: మాఘ పౌర్ణమి పురస్కరించుకొని బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వ్రతాలు, హోమాలు నిర్వహించారు. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. శ్రీమాతా సత్సంగం, లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం సందేశమిచ్చారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని అరోరా నగర్‌లోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి పరుషరాముల రామకృష్ణ, నగర ప్రముఖ్ సూర్య వైకుంఠం సందేశమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు. శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో రమా సహిత సత్యనారాయణ వ్రతం, రాజ శ్యామల హోమం విశేషంగా జరిగాయి. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి


చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) భాస్కర్ పంచాయతీ కార్యదర్శులకు, ఈఓఆర్డీ నాగేష్‌కు సూచించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరు, పెద్దటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంకులను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలన్నారు.

టీకాతో ప్రాణాంతక వ్యాధుల నియంత్రణ


టీకాల గురించి వివరిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): టీకాల వల్ల ప్రాణాంతక వ్యాధులను నియంత్రించవచ్చని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. బుధవారం స్థానిక వడ్డేగేరి యూపీహెచ్‌సీ పరిధిలోని 30వ సచివాలయంలో వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత, కిల్కారి మెసేజ్ విధానం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భవతులు, ఐదేళ్లలోపు చిన్నారులకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను ఎంసీహెచ్ కార్డులో సూచించిన తేదీ ప్రకారం క్రమం తప్పక ఇప్పించాలని తల్లులకు సూచించారు. ఏ టీకా దేనికి ఉపయోగపడుతుందో తల్లులకు అవగాహన కల్పించాలని ఆశాలకు చెప్పారు. పిల్లలకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించి ఏడవ నెల నుంచి అనుబంధ ఆహారం తినిపించాలని తెలిపారు. తల్లులు రక్తహీనత నివారణ కోసం ఆకుకూరలు, పండ్లు, బెల్లం, నువ్వులు, గుడ్లు మొదలైనవి విరివిగా భుజించాలన్నారు. కిల్కారి మెసేజ్ విధానంలో గర్భిణికి 4వ మాసం నుంచి కాన్పు తర్వాత ఒక సంవత్సరం వరకు వారానికి ఒకసారి వాయిస్ మెసేజ్ రెండు నిమిషాల పాటు వస్తుందన్నారు. ఏదైనా కారణం వల్ల గర్భిణి/తల్లికి వాయిస్ మెసేజ్ వినలేకపోతే తర్వాత 14423 నంబర్‌కు కాల్ చేసి వినే అవకాశం ఉందని తెలిపారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్త రవళి తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


విజేతలకు ట్రోఫీని అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి తండ్రి కాటసాని నరసింహారెడ్డి జ్ఞాపకార్థం లైట్ టెన్నిస్ బాల్ క్రికెట్ సూపర్–8 టోర్నమెంట్–2025 నిర్వహించారు. టోర్నమెంట్‌లో విజేతలైన వారికి బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు సుకుమార్, బెల్లం మహేశ్వర్‌రెడ్డి, భీమశంకర్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశీ డిప్లొమాతో వ్యవసాయ పరిజ్ఞానం


ఇన్‌పుట్ డీలర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ఇన్‌పుట్ డీలర్లు దేశీ డిప్లొమా కోర్సు పూర్తి చేయడం ఎంతో ఉపయోగకరమని, రైతులకు చక్కటి సాంకేతిక సలహాలు ఇచ్చే అవకాశం ఏర్పడిందని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్నప్రసాద్ అన్నారు. 2023–24 సంవత్సరంలో ఆత్మ ద్వారా దేశీ డిప్లొమా కోర్సు పూర్తి చేసిన డీలర్లకు గతేడాది అక్టోబరులో మేనేజ్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి బుధవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో సర్టిఫికెట్లు ప్రదానం చేసే కార్యక్రమం జరిగింది. ఆత్మ పీడీ రత్నప్రసాద్, విశ్రాంత జేడీఏ జయచంద్ర, డీఆర్‌సీ డీడీ శ్రీలత, ఏరువాక శాస్త్రవేత్తలు ఇన్‌పుట్ డీలర్లకు సర్టిఫికెట్లు అందచేశారు. ముగ్గురు ఇన్‌పుట్ డీలర్లకు జాతీయ సంస్థ మేనేజ్ ద్వారా గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెరిట్ సర్టిఫికెట్లు లభించడం విశేషం. ఈ సందర్భంగా ఆత్మ పీడీ మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్లలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచడం, వ్యవసాయ చట్టాలపై అవగాహన పెంచడం, షాపుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై అవగాహన పెంచేందుకు డిప్లొమా కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పాదకత పొందే విధంగా రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆత్మ డీపీడీ శ్రీలత, విశ్రాంత జేడీఏ జయచంద్ర, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ, ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు, డీఆర్‌సీ ఏడీఏలు వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, ఏఓ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలులోని ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బుధవారం కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నాయకులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. వారు మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిబంధనలకు విరుద్ధంగా ఆయుష్మాన్ కళాశాల నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంకటరమణ కాలనీలో పర్మిషన్ తీసుకుని గణేష్ నగర్‌లోని సోమిశెట్టి కాలనీలో కళాశాల నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ఈ విషయమై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర అధ్యక్షుడు అబుబాకర్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి

కర్నూలు కల్చరల్: కామన్‌పీజీ సెట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామన్ పీజీ సెట్ ద్వారా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పీజీ ప్రవేశాలు తగ్గిపోయాయన్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను యూనివర్సిటీలకే అప్పజెప్పాలని కోరారు.

ఆలయ దుకాణాల స్వాధీనం


ఆలయ దుకాణాలకు సీల్ వేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: కల్లూరు మండల పరిధిలో ఆక్రమణలకు గురైన చౌడేశ్వరీ ఆలయానికి చెందిన 14 షాపులను దేవదాయ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ గుర్రెడ్డి పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణదారులను దుకాణాల్లోంచి బయటికి పంపి తాళాలు వేశారు. ఏసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు రూ.90 లక్షల ఆలయం వచ్చే దుకాణాలను కొందరు ఆక్రమించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీస్, రెవెన్యూ, దేవదాయశాఖ ఉద్యోగుల సహకారంతో షాపులను ఖాళీ చేయించి పంచనామా చేయించి సీల్ వేయడం జరిగిందన్నారు. ఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, మద్దిలేటి, సీతారామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి.రమేష్, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సమీర్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతులలో భాగంగా క్యాంపు సెక్షన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఈఈ శేషాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు గాయత్రీ ఎస్టేట్, సీ క్యాంపు సెంటర్, ఎల్కూరు ఎస్టేట్, బీడీ కార్మికుల కాలనీ, బృందావన నగర్, అరోరా నగర్, నందికొట్కూరు రోడ్, మారుతి మెగా సిటీ, మారుతినగర్, అరుంధతి నగర్, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వివరించారు.

రూరల్ ఫీడర్ పరిధిలో...

అలాగే రూరల్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు ఉమామశ్వర నగర్, ముజఫర్ నగర్, పందిపాడు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వెల్లడించారు.

14న దామోదరం సంజీవయ్య జయంతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104వ జయంతి కార్యక్రమాన్ని ఈ నెల 14న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కే.తులసీదేవి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, దళిత సంఘాల నాయకులతో కలిసి ఉదయం 9 గంటలకు నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఉన్న సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం అక్కడే జయంతి సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా స్థానిక కలెక్టరేట్‌లోని దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాల అలంకరణ అనంతరం నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి వెళ్లడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రజ లు, దళిత, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని డీడీ కోరారు. సభ అనంతరం మధ్యాహ్నం భోజన వసతి కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

16న నరసం వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం), సాహితీ సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నరసం 7వ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సు ను నిర్వహించనున్నట్లు నరసం జిల్లా అధ్యక్షుడు సుబ్బలక్ష్మి తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు ప్రారంభ సభ ఉంటుందని పేర్కొన్నారు. కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాహితీప్రియులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రెండు వాహనాలు అద్దెకు కావలెను

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమం నిర్వహణకు కర్నూలు, ఆదోని డివిజన్‌లలో రెండు వాహనాలు అద్దెకు కావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనం 10 – 16 సీటింగ్ ఉండాలని, నెలకు 2,500 కి.మీ తిరగాల్సి ఉంటుందని, అద్దె రూ.60 వేలు (డీజిల్, డ్రైవర్ జీతంతో కలిపి) ఉంటుందని వెల్లడించారు. ఆసక్తిగల వారు ఈ నెల 16వ తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని, మరిన్ని వివరాలకు 99667 86760, 90309 00884 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

విద్యుత్ కార్మికుల సంక్షేమం కోసం పోరాటం

కర్నూలు న్యూసిటీ: ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ గత 75 సంవత్సరాలుగా కార్మికుల సంక్షేమం, హక్కుల కోసం పోరాడుతోందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.కృష్ణయ్య అన్నారు. ఆ యూనియన్ 76వ ఆవిర్భావ దినోత్సవం నగరంలోని విద్యుత్ భవన్ వద్ద ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కృష్ణయ్య మాట్లాడుతూ.. యూనియన్ ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయరాదన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అపరిమిత హెల్త్ పాల సీని ప్రవేశపెట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు


ఎస్వీ మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ప్రజలు జగనన్న పాలనను గుర్తు చేసుకుంటున్నారు.
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి వెల్లడి

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడిగా నియమితులైన ప్రేమ్ కుమార్ సన్మాన కార్యక్రమం బుధవారం సాయంత్రం స్థానిక లక్ష్మీనగర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎస్వీ మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గౌరవించాలన్న మాజీ ముఖ్యమంత్రి జగనన్న ఆశయాల మేరకు జిల్లావ్యాప్తంగా ఎంతో మంది కార్యకర్తలకు పదవులు అప్పగించామన్నారు. పదవులతో పార్టీకి మరింత వన్నె తీసుకురావాలని సూచించారు. జగనన్నను ఎదుర్కోలేక మూడు పార్టీలు కలిసి వచ్చి అలివిగాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రస్తుతం ఎక్కడికి వెళ్లినా ప్రజలు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాలు జగనన్న పాలనను గుర్తుకు చేసుకుంటున్నారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 9 నెలలు అవుతున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. దీనిపై ప్రజలు, మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారని, మోసపోయినట్లు అర్థం చేసుకున్నారని చెప్పారు. వైఎస్ జగనన్న ప్రతి ఇంటికి సంక్షేమం అందించారని, నాయీ బ్రాహ్మణులు, రజకులు, ఆటో కార్మికులు, మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను ఐదేళ్ల పాటు అందించారని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టించి పనిచేస్తానని, జగనన్నను సీఎం చేయడమే తమ ధ్యేయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు షరీఫ్, రాఘవేంద్ర, లాజర్, పార్టీ వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

వైద్య పరికరాలను జాగ్రత్తగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని వైద్య పరికరాలను సిబ్బంది బాధ్యతగా నిర్వహించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో సైరిక్స్ హెల్త్ కేర్ బయోమెడికల్ వైద్య పరికరాల వినియోగంపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆసుపత్రి పలు అత్యవసర విభాగాల్లోని బయోమెడికల్ వైద్య పరికరాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. వాటి రికార్డులు సరిగ్గా నిర్వహించాలన్నారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, డాక్టర్ శివ బాల నాగాంజన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, బయోమెడికల్ ఇంజినీర్ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వాలి


వర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసేందుకు వచ్చిన పార్ట్‌టైం స్కాలర్లు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టాలను త్వరితగతిన ప్రదానం చేయాలని పలువురు పార్ట్ టైం పీహెచ్‌డీ పరిశోధకులు బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్‌కు విన్నవించారు. బుధవారం పలువురు స్కాలర్స్ రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్‌నాయుడు, రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని కలిసి తమ ఆవేదన వెలిబుచ్చారు. 2010లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకున్నామని, 14 ఏళ్లు పూర్తయినా పట్టా ప్రక్రియ ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతులు, రెగ్యులర్ పోస్టులకు అర్హత, ఇంక్రిమెంట్ల అర్హత కోల్పోతున్నామని చెప్పారు. కొందరు చనిపోయారని, మరికొందరు గైడ్‌లు మరణించడం జరిగిందన్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పీహెచ్‌డీ పట్టాల మంజూరులో జాప్యం జరుగుతోందన్నారు. ఇప్పటికే తాము అన్ని విధాలుగా నష్టపోయామని, న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. స్పందించిన రిజిస్ట్రార్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీతో మాట్లాడి రెండు వారాల్లోగా ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన


పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు (టౌన్): ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు వాకో ఇండియా కిక్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ అంతర్జాతీయ ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కర్నూలు క్రీడాకారులను జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న క్రీడాకారులు 24 పతకాలు సాధించారన్నారు. అలాగే కర్నూలు నుంచి గుర్రం జయ కళ్యాణ్, హరి, ఉపేంద్ర, ఈశ్వర్ పతకాలు సాధించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కోచ్ నరేంద్ర పాల్గొన్నారు.

ఏపీజేఏసీ ఏడీసీ ఎన్నిక


డివిజన్ నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు

కర్నూలు కల్చరల్: ఏపీజేఏసీ అమరావతి డివిజన్ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ పారె లక్ష్మి, రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీ జనరల్ కె.విజయలక్ష్మి, ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కేవై కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజు ఆధ్వర్యంలో డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కో–ఆప్షన్ చైర్‌పర్సన్‌గా సైరాబాను, అసోసియేట్ చైర్‌పర్సన్‌గా మల్లేశ్వరమ్మ, ప్రధాన కార్యదర్శిగా పద్మావ తి, కో చైర్మన్‌గా శివపార్వతి, జిల్లా కోశాధికారిగా కార్తీక లక్ష్మిని ఎన్నుకున్నారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సహచైర్మన్ మద్దిలేటి, కో–చైర్మన్ శ్రీనివాసులు, అనీష్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.